

నేడు జిల్లాకు మంత్రి జోగి రమేష్ రాక

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈనెల 14వ తేదీన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ జిల్లాకు రానున్నారు. ఉదయం 9 గంటలకు నరసాపురంలోని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ముదునూరి ప్రసాదరాజు క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం మొగల్తూరు మండలం రామన్నపాలెం బయలుదేరి వెళ్లనున్నారు. రామన్నపాలెంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ముదునూరి ప్రసాదరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంట పద్మశ్రీతో కలిసి పాల్గొంటారు. అనంతరం రామన్నపాలెం-1 సచివాలయం వద్ద జరిగే సమావేశంలో పాల్గొనున్నారు.

మొగల్తూరు : చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గురువారం మొగల్తూరు పర్యటించనున్నారని ప్రసాదరాజు కార్యాలయ సిబ్బంది తెలిపారు. రామన్నపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని తెలిపారు.

ఆందోళన బాటలో ఆశాలు



భీమవరంలో ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు (ఫైల్‌ఫోటో)

- కనీస వేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సాధనే లక్ష్యం
- సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- ప్రతి నెలా రూ.3 నుంచి రూ.4 వేలు చేతి సొమ్ము ఖర్చు
- నిర్ణీత కాలపరిమితి ఉద్యోగాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర
- 14 రకాల యాప్‌లతో మరింత పని భారం
- నేటి నుంచి కలెక్టరేట్ వద్ద 36 గంటల మహా ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలు.. వెంటాడుతున్న దీర్ఘకాలిక సమస్యలు.. అనేక రూపాల్లో గోడు వెళ్లగక్కుతున్నా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వాలతో తాడోపేడో తేల్చుకునేందుకు ఆశాలు ఆందోళనకు మరోమారు సిద్ధమయ్యారు. కనీస వేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సాధనే లక్ష్యంగా ముందుకు కదులుతున్నారు. వైసిపి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎండగట్టి సమస్యల పరిష్కారం కోసం కదం తొక్కేందుకు సమాయత్తమయ్యారు. నేడు భీమవరం కలెక్టరేట్ వద్ద 36 గంటల మహాధర్నా చేపట్టనున్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది.

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే ప్రజల ఆరోగ్య పరిస్థితులు చూసే ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయి.

వివిధ రకాల పనులు, అనేక రకాల సర్వేలతో విపరీతమైన పనిభారాన్ని మోపి ఆశాలను అన్ని రకాలుగా ప్రభుత్వం ఒత్తిడి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆశాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో సుమారు 1400 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. బిడ్డ పుట్టిన దగ్గర నుంచి పిసిజి టీకా వేసిన తర్వాత ప్రతినెలా 15 రోజులకు ఒక ఇంజెక్షన్, వదో నెలలో మరొకటి, 16 నెలల నుంచి 24 నెలల తర్వాత ఒక ఇంజెక్షన్ ఆశా కార్యకర్తలు వేస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్ 'ఎ', 16 నెలల నుంచి ఐదేళ్లలోపు, వరకు నుంచి 16 ఏళ్లలోపు ఇంజక్షన్ ఇస్తున్నారు. అంగన్‌వాడీ స్కూళ్లలో ఐఎఫ్ఏ సిరప్‌లు, ప్రతి గురువారము ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. వర్షాకాలం, వేసవిలలో ఫీవర్ సర్వేలు, ప్రతి శుక్రవారము డ్రై డే నిర్వహించడంతోపాటు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న వ్యర్థాలను కూడా ఆశాలే తొలగిస్తున్నారు. ఈ సమయంలో ఆశాలు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. బిడ్డ పుట్టిన దగ్గర నుంచి 16 ఏళ్లలోపు వారి ఆరోగ్య బాధ్యతలను ఆశా కార్యకర్తలు భుజాన వేసుకుని మోస్తున్నారు. చిన్న ఆరోగ్య సమస్య ఏర్పడినా సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు ఆరోగ్య సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఆశాలు విస్తృత సేవలందించారు. బిపి, సుగర్, మలేరియా, డెంగీ ఇలా పరీక్షలన్నీ సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తలు 18 రోజులపాటు సర్వేలు చేసి పని ఒత్తిడికి గురయ్యారు. కిందిస్థాయిలో ఆరోగ్య శాఖలో ఆశా కార్యకర్తలు ప్రభుత్వ లక్ష్యాన్ని చేరువ చేస్తూనే ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడంలో ఎనలేని కృషి చేస్తున్నారు. అయితే వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తూనే ఉద్యోగ బాధ్యతల్లో రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చివరకు ఆశా కార్యకర్తలు మృత్యువాత పడుతున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లో ఆశా కార్యకర్త కృపమ్మ పని ఒత్తిడి తట్టుకోలేక మృతి చెందిన విషయం తెలిసిందే.

తీవ్ర పని ఒత్తిడి.. వేధింపులతో సతమతం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్యకర్తల సమస్యలు కనీసం పట్టించుకున్న దాఖలాల్లేవు. సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి కొత్త సమస్యలు సృష్టిస్తుందనే విమర్శ ఉంది. ఆశా వర్కర్లపై మరింత పనిభారాన్ని పెంచింది. రూ.10 వేలు వేతనం ఇస్తున్నామనే పేరుతో 24 గంటలు వెట్టిచాకిరీ చేస్తున్న పరిస్థితి ఉంది. రకరకాల పనులను బెదిరించి చేయిస్తున్నారు. మొబైల్ వర్క్ ట్రైనింగ్ ఇవ్వకుండా 14 రకాల యాప్‌ల ద్వారా పనులు చేస్తున్నారు. నెట్‌వర్క్ లేకపోయినా, ఫోన్లు పని చేయకపోయినా ఆశాలను బాధ్యులను చేస్తూ నిందిస్తున్నారు. పనులు చేయకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయి. ఆన్‌లైన్ వర్క్‌తో పాటు 26 రికార్డులకొని రాయాలని, రోజూ రిజిస్టర్లో సంతకాలు పెట్టాలని, హెల్త్ క్లినిక్ సచివాలయంలో రోజంతా కూర్చోవాలని, మిగిలిన సమయంలో ఫీల్డ్‌వర్క్ చేయాలని నిబంధనలు పెట్టి పనిఒత్తిడికి గురిచేస్తోంది. అయితే వీటి నిర్వహణలో ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెరుగుతున్న ధరలు, పనిభారం చాలీచాలని వేతనాలతో ఆశాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ సందర్భాల్లో నిర్వహించే సమావేశాలకు వెళ్లేందుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల చేతిసొమ్ము వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది.

నేటి నుంచి కలెక్టరేట్ వద్ద 36 గంటల మహాధర్నా

కనీస వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని, ఆన్‌లైన్ లేదా రికార్డ్స్ వర్క్ ఏదైనా ఒక పని ఒక్కసారే మాత్రమే చేయించాలని, మొబైల్ వర్క్‌పై శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, మెటర్నటీ లీవులు, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేటి నుంచి 36 గంటల మహాధర్నాకు పిలుపునిచ్చింది. దీంతో ఆశా కార్యకర్తలు ధర్నాకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలంతా తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గళం విప్పనున్నారు. వంటా, వార్పు, బస, ధర్నా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనేందుకు భీమవరం తరలిరానున్నారు.

ఆందోళన ఉధృతికి సిద్ధం

డి.జ్యోతి,ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆశాల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అనేకసార్లు సమస్యలు విన్నవించినా పట్టించుకున్న దాఖలాల్లేవు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని భావించి ఆందోళనకు సిద్ధమయ్యాం. 36 గంటల మహాధర్నాతో ప్రభుత్వం దిగిరావాలి. లేకపోతే ఆందోళన ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

చింతపల్లి లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు



కనీస వేతనాలు చెల్లించడం లేదు. పని భారం విపరీతంగా పెరిగింది. ప్రభుత్వ సెలవులు, మెడికల్ మెటర్నిటీ లీవులు అమలు జరగడం లేదు. టిఏ, డిఎలు అందించడం లేదు. గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కూడా లేవు. అనేక సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. 36 గంటల మహాధర్నాకు జిల్లాలోని ఆశా కార్యకర్తలంతా తరలిరావాలి.

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

భీమవరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వవిఫ్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 19వ తేదీ మంగళవారం ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో బుధవారం సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక లేఔట్‌లో సభావేదికను, లూథరన్ హైస్కూల్ హెలీప్యాడ్‌ను జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి గ్రంధి.శ్రీనివాస్ పరిశీలించారు. సభాస్థలికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ సుందరీకరణ చేయాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, అధికారులు పాల్గొన్నారు.

రహదారిని పునర్నిర్మించండి

అర్తమూరు గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - ఉండి



ఆందోళన చేస్తున్న అర్తమూరు యువకులు

తమ గ్రామానికి రహదారిని పునర్నిర్మించాలని అర్తమూరుకు చెందిన కొంతమంది యువకులు బుధవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల సిపిఎం కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలాల్లోని చెరుకువాడ అర్తమూరు రాష్ట్రీయ రహదారిని పునర్నిర్మించాలని కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తులు పలుసార్లు అధికారులు, నాయకుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి గోతులమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. రోడ్డు భవనాల శాఖ అధికారులకు తమ గోడు విన్నవించుకుందామంటే రోడ్డు భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ అందుబాటులో లేరని తెలిపారు. వెంటనే తమ గ్రామానికి రహదారిని పునర్నిర్మించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్‌ను కోరి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామకూరి వెంకటరత్నం, జి.సంజీవరావు, కె.యోహాను, కె.సురేష్, ఎన్.రాంబాబు, బి.సందీప్, ఎన్.ఏసు, బి.చిన్ని పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

తుపాన్ ప్రభావంతో పంట నష్టాన్ని తట్టుకోలేక చనిపోయిన కౌలురైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. పంట నష్టాన్ని తట్టుకోలేక పాలకొల్లు మండలం, కాపవరం గ్రామానికి చెందిన కౌలు రైతు గెడ్డం పెద్దిరాజు గుండెపోటుతో చనిపోయారన్నారు. దీనికి ప్రభుత్వమే జవాబుదారీతనం వహించాలన్నారు. ప్రభుత్వం తక్షణం పెద్దిరాజు కటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. పంటనష్టం, బీమా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉపాధి, గృహ వసతి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోకపోతే ఇలాంటి దురదృష్టకర మరణాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో ఆక్వారైతు పంట నష్టాన్ని, అప్పుల బాధను తట్టుకోలేక భార్యాభర్త ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తిచేశారు. ప్రభుత్వం నష్టపోయిన సన్న, చిన్నకారు, పేద, కౌలు, ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రద్దయిన దళితుల పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు



టిడిపి దళిత నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

వైసిపి ప్రభుత్వంలో రద్దయిన 27 దళిత స్కీములు అమలు చేయాలని ఒత్తిడి తెచ్చేలా పాలకొల్లు నియోజకవర్గ దళిత ప్రాంతాల్లో ఇంటింటా ప్రచార కార్యక్రమం తలపెట్టినట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. రద్దయిన 27 దళిత స్కీములను అమలు చేయాలని బుధవారం టిడిపి కార్యాలయంలో కరపత్రాలను టిడిపి దళిత నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో దళిత స్కీములు రద్దు చేయడమే కాకుండా దాడులు, అత్యాచారాలు, హత్యలు, శిరోముండనాలు వంటివి పెరిగాయన్నారు. ప్రధానంగా ఎస్సి ఉప ప్రణాళిక నిధులను నిర్వీర్యం చేసిందన్నారు. ఇప్పటికైనా దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దళిత స్కీములు అమలుతో పాటు ఎస్సి ఉప ప్రణాళిక నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్సి నాయకులు పాల్గొన్నారు.



ఎంఇఒ మురళీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న స్కూల్ స్వీపర్లు

బకాయి వేతనాలివ్వాలని స్కూల్ స్వీపర్ల నిరసన

ప్రజాశక్తి - తణుకురూరల్

స్కూల్ స్వీపర్లకు 8 నెలల బకాయిలు వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలోకి చొరబడి బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒ మురళీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, గార రంగారావు మాట్లాడుతూ స్కూల్ స్వీపర్లకు 8 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారన్నారు. మున్సిపల్ స్కూల్ ఉన్న విధంగా మండల ఏడ్యుకేషన్ నుండి కూడా వేతనాలు ఇవ్వాలన్నారు. ఇస్తున్న రూ.4 వేలు పెరుగుతున్న ధరలతో చాలడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు ఇవ్వకుంటే మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వీపర్స్ యూనియన్ అధ్యక్షులు పి.శారద, కార్యదర్శి కొంగరపు సత్యవతి, ధనలక్ష్మి, పి.లక్ష్మి, హేమలత, బంగారమ్మ, మహాలక్ష్మి, అర్జునమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం

నినదించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - భీమవరం



కాళ్ల : అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎంఎల్ఎ రామరాజు

అంగన్‌వాడీ కార్మికుల సమ్మె విచ్ఛిన్నకర చర్యలు రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో భీమవరంలో చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజు కూడా కొనసాగింది. శిబిరాన్ని సందర్శించిన రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌శాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.విజయలక్ష్మి, సావిత్రి, దుర్గా, మేరీగ్రేసి, తాయారు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, నాయకులు వాసుదేవరావు, ఇంజేటి శ్రీను, గణేష్, కోదండం పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ విధానం మారకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్‌డి హసీనా బేగం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మండలంలో బుధవారం రెండో రోజు కొనసాగింది. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో చేపట్టిన సమ్మెలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెంకి అప్పారావు, తవిటి నాయుడు, షేక్ వలీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వి.ఫైడేశ్వరి, ఎన్.కనకదుర్గ, ఖాళీ, విజయ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా గోపాలన్, సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడారు. సమ్మెకు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బల్ల చిన వీరభద్రం, పంచాయతీ కార్మికులు, రైస్ మిల్లు కార్మికులు, హమాలీలు మద్దతు తెలిపారు.

గణపవరం : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. అలాగే అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీలక్ష్మి మాట్లాడారు. కార్యక్రంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, అంగన్‌వాడీ మండల నాయుకులు బి.రామకోటి, కెవి.మహాలక్ష్మి, జయలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట : అంగన్‌వాడీలకు రూ.26 వేల వేతనంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఆచంట కచేరీ సెంటర్లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్షలకు గోపాలన్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, పుడక నాగలక్ష్మి, వరలక్ష్మి అరుణ్ కుమారి, సుజాత, బి రాణి, కమల, ధనలక్ష్మి దుర్గమ్మ పెద్దింట్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పూర్తిగా నిర్వీర్యం చేసే ఆలోచనతో ముందుకెళ్తోందని సిపిఎం సీనియర్ నాయకులు కార్యదర్శి తలుపూరి బుల్లబ్బాయి విమర్శించారు. ఆచంట కచేరీ సెంటర్లో చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు సిపిఎం మండల కమిటీ సభ్యులు పి.మోహన్‌రావు, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, మన్నే బ్రహ్మయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా ఏరియా నాయకులు శారా జోషి సంఘీభావం తెలిపారు.

మొగల్తూరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన రెండోరోజు కొనసాగింది. శిబిరానికి సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడారు. ఆయన వెంట సిపిఎం నాయకులు యడ్ల చిట్టిబాబు, ఎ.సాంబమూర్తి, కొత్తపల్లి నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీలు జి.పెద్దింట్లు, కె.సీత, ఎస్.సారమ్మ, రాజి పాల్గొన్నారు.

పోడూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బూరాబత్తుల వెంకటరావు, లీడర్లు రాయుడు కుమారి, జక్కంశెట్టి ఉమాదేవి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక కోర్టు వద్ద 2వ రోజు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిఐటియు నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, ఆంజనేయులు, గొల్లపల్లి మేరీ రాజకుమారి, మధుషీలా, ఎం.జ్యోతి, కె.నళినీరాణి పాల్గొన్నారు.



నరసాపురంలో..

పెనుగొండ : అంగన్‌వాడీల వేతనాల పెంపుపై జగన్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు అన్నారు. సమ్మెకు పెనుగొండ సర్పంచి నక్కా శ్యామల సోని మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల ప్రాజెక్టు లీడర్ తులసి, సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పాలకొల్లు : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు రెండోరోజు కొనసాగాయి. ఈ దీక్షలకు జనసేన నేతలు మద్దతు తెలిపారు.

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యూటీ అమలు చేయాలని సిఐటియు పట్టణ కమిటీ నాయకులు కర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, సిపిఎం మండల నాయకులు కండెల్లి సోమారాజు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఉండి : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ హసీనా బేగం అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా హసీనా బేగం మాట్లాడారు. సమ్మెకు సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, మోపిదేవి రాము మద్దతు పలికారు.

పాలకోడేరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు లారెన్స్ కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అత్రియ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. కార్యక్రమంలో విజయలక్ష్మి, విమల, తులసి, ఎం.విమల, హేమకుమారి, మరియమ్మ పాల్గొన్నారు.

యలమంచిలి : అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మెకు జిల్లా నాయకురాలు సరిపల్లి జయప్రభ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, నాయకులు రజనీ, పద్మశ్రీ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: నరసాపురంలో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు కొనసాగాయి. దీక్షలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. అలాగే సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కౌరు పెద్దరాజు మాట్లాడారు. అనంతరం టిడిపి మహిళా నాయకురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు గుబ్బల రాజేశ్వరి, భోగేశ్వరి, జైశ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కాళ్ల : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు కోరారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మెకు ఎంఎల్ఎ సంఘీభావం తెలిపారు. సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడారు. సంఘం కార్యదర్శి మండా సూరిబాబు, అంగన్‌వాడీ నాయకులు యడవల్లి చంద్రావతి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పెంటపాడు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. సమ్మెనుద్దేశించి అంగన్‌వాడీ నాయకులు ఆర్.అనురాధ, వి.కనకమహాలక్ష్మి, సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కె.మంగ తాయారు, టి.వెంకటలక్ష్మి, వరలక్ష్మి, నాగమణి, శిరీష, ఝాన్సీలక్ష్మి, విజయలక్ష్మి, గాయత్రి, గంగా భవాని, హైమావతి పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్ఎఫ్ఐ 45వ జిల్లా మహాసభను పాలకొల్లు పట్టణ కేంద్రంగా డిసెంబర్ 15, 16 తేదీల్లో జరగనున్నాయని జిల్లా అధ్యక్షుడు పి.వాసు తెలిపారు. పాలకొల్లు ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం కమిటీ సభ్యులు శేఖర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వాసు మాట్లాడుతూ 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు గాంధీబొమ్మల సెంటర్ నుంచి విద్యార్థుల ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం డిఎన్ఆర్ కళాశాల వద్ద జరిగే బహిరంగ సభకు ఎంఎల్సి షేక్‌షాబ్జీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కె.యశ్వంత్, సతీష్, శ్రీనుబాబు, పవిత్ర పాల్గొన్నారు.

సంగీత విద్వాంసులు ప్రసాద్‌కు సత్కారం

భీమవరం రూరల్ :భారతదేశ శాస్త్రీయ సంప్రదాయ సంగీతాన్ని ఆరు దేశాల్లో చాటి చెప్పి విశేషమైన సత్కారాలు పొంది తిరిగి స్వగ్రామం భీమవరానికి వచ్చిన ప్రముఖ సంగీత విద్వాంసులు పిప్పళ్ల ప్రసాద్‌రావును శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులోని శ్రీవిద్యావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కంతేటి వెంకటరావు, కార్యదర్శి కుక్కల బాల మాట్లాడుతూ దేశ విదేశాల్లో మన సంగీత కళను, దేశ గౌరవాన్ని చాటిచెప్పిన వ్యక్తి పిప్పళ్ల ప్రసాద్ అని అన్నారు. పిప్పళ్ల సంగీత సేవలు అద్వితీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నవంబర్ 11 నుంచి డిసెంబర్ ఆరు వరకు ఆరు దేశాల్లో సంగీత భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పిప్పళ్ల ప్రసాద్‌ను స్వచ్ఛంద సంస్థలు, కళాకారులు ఘనంగా సత్కరించారు. కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, పాశ్చ నాటక పరిషత్ అధ్యక్షులు గొన్నాబత్తుల మల్లేశ్వరావు, చక్రవర్తి, ప్రజా నాట్య మండలి జిల్లా సభ్యులు ఎం.సీతారామప్రసాద్, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో నాగేశ్వరరావు ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో మండలంలోని దండగర్ర గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అర్జుల నాగేశ్వరరావు తృతీయ బహుమతి సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 79 దేశాల నుంచి 24,662 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థికి తృతీయ బహుమతి లభించడం గర్వకారణమన్నారు.


ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - పోడూరు

మిచౌంగ్ తుపాన్ వల్ల నీట మునిగిన పంటకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం పోడూరు మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కవిటం, పోలవరం, కొమ్ముచిక్కాల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ తేమ శాతంతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. సంచులు సకాలంలో ఇవ్వాలన్నారు. మొలకలు వచ్చిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు.

పలుచోట్ల 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కాళ్ల



కాళ్ల : మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన

టిడిపి, జనసేన ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్తాయని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని ఏలూరుపాడులో మంతెన ఆంజనేయులు అధ్యక్షతన టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి బాబుతో నేను, ఇంటింటికి రాంబాబు, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని గౌరవించని పార్టీ వైసిపియేనన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం పరిపాటిగా మారిందన్నారు. నాదెండ్ల మనోహర్‌ను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు వర్షపట్ల హరిబాబు, కనగళ్ల వెంకట సత్యనారాయణ, యాళ్ల చిట్టిబాబు, జనసేన ఏలూరుపాడు గ్రామ అధ్యక్షులు యాదాల వెంకన్నబాబు, యాళ్ల రవి, చినమిల్లి సురేష్, లింగం బోసయ్య, ఏసోబు, మోషే, కొట్టు ఇందిర, ప్రభాకరరావు, నారాయణమూర్తి, తలగళ్ల వెంకటేశ్వరరావు, వాసురాజు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక 31వ వార్డులో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పాల్గొని మాట్లాడారు. వైసిపి హయాంలో అన్ని రకాల నిత్యావసర సరుకులు, వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. అమ్మ ఒడి, చేయూత, పెన్షన్, రేషన్ వంటి సంక్షేమ పథకాలు ఏడాది పాటు ఇచ్చి అనేక సాకులతో తొలగించారన్నారు.

కన్నయ్యకు ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్న వైసిపి నాయకుడు సోమ కన్నయ్యను ఎంపిపి శ్రీహరినారాయణరాజు, ఉండి పంచాయతీ పాలకవర్గ సభ్యులు, నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీహరినారాయణరాజు మాట్లాడుతూ సోమ కన్నయ్య పార్టీ పట్ల విధేయతతో పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేసేవారన్నారు. కన్నయ్య త్వరగా కోలుకుని పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేయాలని కోరారు.

సోమేశ్వరస్వామి ఆదాయం రూ.73,36,576

భీమవరం రూరల్ :భీమవరం గునుపూడిలో ఉన్న పంచారామక్షేత్రం శ్రీసోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానానికి కార్తీక మాసం సందర్భంగా 28 రోజులకు రూ.73,36,576 వచ్చినట్లు ఆలయ ఇఒ కృష్ణంరాజు తెలిపారు. పూజా రుసుముల ద్వారా రూ.5,98,224, రూ.50 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.15,36,050, రూ.వంద దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.16,05,500, రూ.200 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.11,46,900, ఉచిత ప్రసాదం ద్వారా రూ.15 వేలు, 31,370 లడ్డులు విక్రయించడం వల్ల రూ.4,70,550, హుండీల ద్వారా రూ.19,64,352 మొత్తం ఆదాయం రూ.73,36,576 వచ్చినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు జనసేన పరామర్శ

గణపవరం :మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు బుధవారం పరామర్శించారు. అర్ధవరంలో సుంకరరమేష్, విలసంపాడులో యర్రపల్లి వీరాస్వామి, వరదరాజపురంలో సామన నాగరాజు, సరిపల్లిలో గోగుల మాణిక్యం, గణపవరంలో పలువురు కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేరాలు – ఘోరాలు

పాలకొల్లులో చోరీ

నగదు, బంగారం అపహరణ

పాలకొల్లు :పాలకొల్లులోని కాస్మో క్లబ్ వెనుక టీచర్ ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రెండు కాసుల బంగారం, రూ.15 వేల నగదు అపహరణకు గురైనట్లు టీచర్ బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టీచర్ భర్త మరో ప్రాంతంలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్నారు. టీచర్, ఆమె తల్లి వారి సొంత ఊరిలో కార్తీక దీపోత్సవం చూడటానికి వెళ్లి మంగళవారం సాయంత్రం తిరిగి వచ్చారు. వారు వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్టు గుర్తించారు. బీరువాలో నగదు, బంగారం అపహరణకు గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో మూడు గంటల పాటు ఉండి బీరువా బద్దలు కొట్టి నగదు, బంగారం అపహరించినట్లు ఇంట్లో ఉన్న సిసి కెమెరాలో రికార్డైంది. పట్టణ సిఐ డి.రాంబాబు సారథ్యంలో ఎస్ఐ ముత్యాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆచంట (పెనుమంట్ర) : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన పెనుమంట్ర మండలంలోని ఆలమూరు రైస్‌మిల్లు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమంట్ర మండలంలోని ఓడూరు గ్రామానికి చెందిన ఎస్.దానయ్య, విశాఖ పట్నానికి చెందిన జి.రాజు ద్విచక్రవాహనంపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కృష్ణవర్మ, పెద్దిరాజు

5 నుంచి తెలుగు మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

వచ్చే జనవరి 5, 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న ఆంధ్ర సార్వత్రిక పరిషత్ ప్రపంచ తెలుగు మహాసభలను జయప్రదం చేయాలని పరిషత్ వ్యవస్థాపన పాలకొల్లు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పాలకొల్లు మాంటిస్సోరీ విద్యా సంస్థల ప్రాంగణంలో బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. తొలి ఆహ్వాన పత్రికను ప్రచార కార్యదర్శి డాక్టర్ పెద్దిరాజు కోలాటి కమిటీ సభ్యుల చేతుల మీదుగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ కెవి.కృష్ణవర్మకు అందించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్, చీఫ్ కన్వీనర్ డాక్టర్ కేశిరాజు రాంప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషాభిమానులు, భాషా పండితులు, కవులు కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న వారందరూ సభల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు చేగొండి రంగారావు, నాగలింగేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - తణుకు

సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని స్థానిక మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు తెలిపారు. ఈ నెల పదో తేదీన దేవరపల్లిలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు 18 బంగారు, మూడు వెండి, ఒక కాంస్య పతకాన్ని సాధించారన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించే ఎనిమిదో జాతీయ కరాటే పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. కర్నూలు జిల్లా నంద్యాలలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో తమ స్కూలు విద్యార్థి ఎన్ఎస్.సంతోష్ బంగారు పతకాన్ని సాధించినట్లు తెలిపారు.

కాపవరంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కాపవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే ఈ ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపులో బిపి, షుగర్ ఇతర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఒక నెలకు మందులు అందిస్తున్నామన్నారు. ఈ క్యాంపునకు ముందు రోజున ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను క్యాంపునకు రావాలని తెలియజేస్తున్నారన్నారు. ఈ క్యాంపులను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎంఎల్‌హెచ్‌పిలు యువతేజ, కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ కె.ప్రసాద్, ఓడూరి సురేష్‌కుమార్, ఆశా కార్యకర్తలు వి.నాగమణి, జ్ఞానసుధ, సుందరమ్మ, డి.నాగమణి పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరులోని ఒకటో సచివాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాలకు చెందిన వారికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాకిట్లను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, నాయకులు కుక్కల కృష్ణమోహన్, కర్రి ఏసు, రేవు రాంబాబు, లోకం నాని, బాలం నాగమల్లేశ్వరరావు, తన్నీడి గిరి, వేగి బాబి, కొత్తపల్లి బాబి, చిక్కాల చిన్న పాల్గొన్నారు.

అగ్రహారంలో సూపర్ శానిటేషన్

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామంలోని ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సూపర్ శానిటేషన్ నిర్వహించామని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడకుండా సూపర్ శానిటేషన్ నిర్వహించామని చెప్పారు. పారిశుధ్యం క్షీణించిన ప్రాంతాల్లో దగ్గరుండి శానిటేషన్‌ను పర్యవేక్షించామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా వైరల్ ఫీవర్ బారిన పడితే వెంటనే హెల్త్ క్లినిక్ సిబ్బందికి, పంచాయతీ దృష్టికి తీసుకురావాలని కోరారు.

'జగన్‌కు ఓటమి భయం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలు ప్రజాదరణ పొందడంతో జగన్ ఓటమి భయంతో 42 మంది ఇన్‌ఛార్జులను మార్పు చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. జగన్ అవినీతి, అరాచక అక్రమాలపై ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్ ప్రజలను మోసగించారని విమర్శించారు.

లైన్‌మెన్ సురేష్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఉండి

ఉండి విద్యుత్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న మండ సురేష్‌కు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి రావడంతో సహచర ఉద్యోగులు సురేష్‌ను సత్కరించారు. సురేష్ భీమవరం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మదాఖాన్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. సురేష్‌ను పలువురు అధికారులు, సిబ్బంది అభినందించారు.

18 మందికి కంటి శస్త్రచికిత్స

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల నుంచి 18 మందిని కంటి చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని బుద్ధుడు కంటి ఆసుపత్రికి పంపించామని డాక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. వారందరికీ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా నేత్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. నేత్ర చికిత్సలు అవసరమైన వారు ఆశ, ఎఎన్ఎంలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.లక్ష్మీపార్వతి, ఎంపిహెచ్ఇఒ ఎఎస్ఎస్ఎన్.మూర్తి, పిహెచ్ఎన్ఎస్ జె సావిత్రి, ఎంపిహెచ్ఎస్‌బి శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త పి.రామకృష్ణ పాల్గొన్నారు.

పంటను ఒడ్డుకు చేర్చేందుకు రైతన్నల పాట్లు

ప్రజాశక్తి - కాళ్ల



వరి పనలను పడవపై తీసుకెళ్తున్న కూలీలు

ఖరీఫ్ పంట బాగా పండింది. ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చేది. నాలుగు రోజుల్లో పంట భద్రంగా ఇంటికి చేరేది. ఇంతలో మిచౌంగ్ తుపాను ప్రభావంవల్ల భారీ వర్షాలు కురిసి వరి నేల కొరిగింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కళకళలాడిన పంట పొలాలు ఇటీవల తుపాను ప్రభావం వల్ల వరి చేలు నెలకొరిగాయి. రైతు ఆరు గాలం కష్టం నీటిలో తడిసిపోయింది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన అన్నదాతలు కన్నీళ్లు పెడుతున్నారు. తుపాన్ దెబ్బకు కాళ్ల మండల రైతులకు రూ.లక్షల్లో పంట నష్టం వాటిల్లింది. మండలంలో 3,878 ఎకరాల్లో సార్వా సాగవుతోంది. రెండు వేల ఎకరాల పంటకు నష్టం వాటిల్లింది. కాళ్ల, సీసలి, బొండాడ, జక్కరం, కాళ్లకూరు, దొడ్డనపూడి గ్రామాల్లో వరి పంటను ఒడ్డుకు చేర్చేందుకు రైతులు వ్యయ ప్రయాసలు పడుతున్నారు. తుపాన్ తగ్గి రోజులు గడుస్తున్నా నీరు తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు, కౌలు రైతులు పడవలతో, ట్రైల్లో వరి పంటను ఒడ్డుకు చేర్చుతున్నారు. రెట్టింపు కూలీ చెల్లించి పచ్చి వరి పనలను మాసూళ్లు చేస్తున్నారు. ఇంత చేసినా పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు, కౌలు రైతులు వాపోతున్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని, రైతులు ధైర్యంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆచంట, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి విస్తృతంగా పర్యటించి నేలకొరిగిన పంట దుబ్బులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్య పడొద్దని, రైతులు ధాన్యం అమ్ముకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సడలింపులు చేసిందని చెప్పారు. ఆన్‌లైన్ అవసరం లేదని, ఆఫ్‌లైన్ ద్వారా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి తమకు నచ్చిన రైసు మిల్లులకు త్వరితగతిన ధాన్యం తరలించుకోవాలన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి తరలించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ జయలలిత, మండల విస్తరణాధికారి బి.నాగరాజు, ఎఎంసి ఛైర్మన్ లావణ్య, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, నాయకులు సత్యనారాయణ, రైతులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చరా..?

మండల సమావేశంలో ఎంపిటిసి సభ్యులు హనుమ నిలదీత



నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న హనుమ

ప్రజాశక్తి - ఆకివీడు


తమ గ్రామంలో శివారు ప్రాంతంలో ఉన్నవారికి ఎంతో కాలంగా తాగునీరు, వీధి దీపాలు లేవని, సమస్యలు పరిష్కరించరా అని జనసేన పార్టీకి చెందిన గుమ్ములూరు ఎంపిటిసి సభ్యులు హనుమ నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే సమస్యపై ఎంతో కాలంగా ఎన్నో సమావేశాల్లో చర్చించారని, నేటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆవేదనకు ఒక ప్రజాప్రతినిధిగా ఇక్కడ విలువ లేదా, ప్రజా సమస్య పట్టదా అంటూ ఆయన తన నిరసన వ్యక్తం చేశారు. సభా ప్రాంగణం మధ్యలో నేలపై కూర్చుని నిరసన దీక్ష ప్రారంభించారు. సమస్య పరిష్కరిస్తే తప్ప తాను కదిలేది లేదన్నారు. సమావేశం పూర్తయిన వెంటనే ఆ సమస్యపై చర్చిస్తామని, అవసరమైతే హాజరు అవుతామని హామీ ఇవ్వడంతో ఆయన దీక్ష విరమించారు. సమావేశం అయిన అనంతరం ఎంపిపి, ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వెళ్లి పరిశీలించారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, అధికారులందరూ హాజరు కాలేదు.

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా చంద్రకళ

పాలకొల్లు :వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా పాలకొల్లుకు చెందిన మద్దా చంద్రకళ నియమితులయ్యారు. జాయింట్ సెక్రటరీగా సీనియర్ న్యాయవాది, వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ కర్రా జయసరిత నియమితులయ్యారు. వీరికి నియోజకవర్గ సమన్వయకర్త గుడాల గోపీ, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, వైసిపి సీనియర్ నేతలు చెల్లెం ఆనందప్రకాష్, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు శుభాకాంక్షలు తెలిపారు.

వైసిపి హయాంలో గ్రామాలాభివృద్ధి : పివిఎల్


ప్రజాశక్తి - పాలకోడేరు



శంకుస్థాపన చేస్తున్న పివిఎల్.నరసింహరాజు

వైసిపి పాలనలో గ్రామాలాభివృద్ధి ముందుకు సాగుతోందని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని గరగపర్రులో జల జీవన్ పథకంలో మంజూరైన రూ.3.50 లక్షలతో ఎస్‌సి కాలనీలో పైపులైన్ నిర్మాణానికి, కోడుగట్టు రాజులు వీధి ప్రాంతంలో జెడ్‌పి నిధులు రూ.10 లక్షలతో, ఊర చెరువు ప్రాంతంలో ఎన్ఆర్ఇజిఎస్ రూ.4 లక్షల నిధులతో డ్రెయినేజీల నిర్మాణానికి ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు)తో కలిసి పివిఎల్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి తోకల సునీత సాల్మన్‌రాజు, వత్సవాయి రామరాజు, ఎంపిటిసి సభ్యులు షేక్ పాపాసాహెబ్, తమ్మిశెట్టి అబ్బులు, కోడూరి నాగేశ్వరరావు, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీవిశ్వనాథరాజు, చింతలపాటి సూర్యనారాయణరాజు, విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా హరినాయుడు పుట్టినరోజు వేడుక



హరినాయుడు పుట్టినరోజు వేడుకల్లో నాయకులు

ఉండి :తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు, ఉండి పంచాయతీ నాలుగో వార్డు సభ్యులు చెన్నంశెట్టి హరినాయుడు పుట్టినరోజు వేడుకలు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ తెలుగు యువత అధ్యక్షులు హరి నాయుడు భవిష్యత్తులో పార్టీలో మరిన్ని మంచి పదవులను అధిరోహించాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, పార్టీ గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ, సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కన్నెగంటి రూత్‌కళ, మంతెన సాయి లచ్చిరాజు, కందుల బలరామకృష్ణ, కాగిత మహంకాళి, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, మజ్జి కృష్ణప్రసాద్, గొల్ల విక్టర్‌బాబు, పాలపర్తి బాలాజీ, గంధం శ్రీనివాస్, ముగ్గళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

భవిత స్కూలులో వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఆలమూరు భవిత విలీన విద్యా స్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగులు విద్య, వైద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో నేడు ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఎంఇఒ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వికలాంగులకు పౌష్టికాహారం ఉచిత విద్య, వసతి అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. వికలాంగుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులను, భవిత స్కూల్ ఉపాధ్యాయులను కోరారు. భవిత స్కూల్ ఆలమూరు ఐఇఆర్‌టి జె.విజయలక్ష్మిని సత్కరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసులు మురళీకృష్ణ, ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, కో–ఛైర్మన్ పడాల జగన్నాథరెడ్డి, మాజీ అధ్యక్షులు కడలి సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.సుబ్బారావు, భవిత స్కూల్ ఐఇఆర్‌టి పి.సునీత పాల్గొన్నారు.

ఉండిలో రూ.26 కోట్లతో అభివృద్ధి పనులు

ఉండి :సుమారు రూ.26 కోట్లతో ఉండి సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు ఉండి ఎంపిపి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఉండి మండలంలోని ఒకటో సచివాలయంలో డిజిటల్ బోర్డును, వైసిపి స్తూపాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, సర్పంచి కమతం సౌజన్యబెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్ వర్మ మాట్లాడుతూ ఉండి నాలుగు సచివాలయాల పరిధిలో సుమారు రూ.వంద కోట్లతో సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పివిఎల్ నరసింహరాజును ఉండి నియోజకవర్గంలో అఖండ మెజారిటీతో గెలిపించి సిఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు ఆంజనేయ రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున్, ఎంపీటీసీ వీరమల్లు సత్యవతి శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ బడుగు బాలాజీ, జెసిఎస్ మండల కన్వీనర్ బులుసు రామకృష్ణ, నాయకులు రణస్థల మహంకాళి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **POLISETTY VENKATA TATA RAO** S/o. Polisetty Brahmiah, D.14-12-4, I.V.L. Street, Near Sikile Girls Hostel, Narsapur, W.G.Dt. A.P. I have changed my name from **POLISETTI VENKATA TATA RAO,** (Old name) to **POLISETTY VENKATA TATA RAO** (New name) hence after all my documents and correspondence will be countinue with my new name **POLISETTY VENKATA TATA RAO** S/o. Polisetty Brahmiah.

మహారాజశ్రీ ఏలూరు మొదటి అదనపు జిల్లా కోర్టులో

I.A. No. 472/2023, I.A. No. 473/2023 I.A. No. 474/2023 in MVOP No. 43/2020

బిట్వీన్:

కె.యశ్వంతరాయలు -పిటీషనరు

AND

ఎ.శేషగిరిరావు & అదర్స్ -రెస్పాండెంట్లు

R-3: అడబాల దుర్గా భూలక్ష్మి
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 48 సంIIలు

R-4: అడబాల స్వామినాయుడు
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 34 సంIIలు

R-5: అడబాల రాజ
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 32 సంIIలు

R-6: అడబాల బేబి ధనలక్ష్మి
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 24 సంIIలు

All are residents of D.No. 8-104/A, మత్స్యపురి రోడ్, వీరవాసరం (V&M), పIIగోIIజిల్లా.

పై నెంబరు పిటీషన్లు యందు 3 నుండి 6వ రెస్పాండెంట్సుకు నోటీసు నిమిత్తం **ది. 19-12-2023వ తేదీన ఆక్షేపణలున్నచో శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 నిIIలకు** హాజరు కాని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

జగ్గవరపు సురేష్‌కుమార్‌రెడ్డి
అడ్వకేటు, ఏలూరు-1
సెల్: 9441606789

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం, సాలిపేట, డోర్ నెం. 2-179, వాడపల్లి కౌసల్య, W/o. రమేష్ అను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **S2639041.** నేను వీరవాసరం గ్రామంలో నివసిస్తున్నాను. నేను మా అమ్మగారి ఊరు వరహాపట్నం వచ్చాను. ది. 12-09-2023న నా పాస్‌పోర్టు జిరాక్స్ తీసుకొనుటకు ఆటోలో కలిదిండి సెంటర్‌లో జిరాక్స్ తీసుకొని వస్తుండగా మార్గమధ్యములో ఎక్కడో పోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

వాడపల్లి కౌసల్య
W/o. రమేష్, డోర్ నెం. 2-179
సాలిపేట, వీరవాసరం
వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 6309713179

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 540/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku
AND
Defendants:
Pithani Varalakshmi and another

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. పీతాని వరలక్ష్మి, W/o. సత్యనారాయణ, హిందువు, 40 సంIIలు, డో.నెం. 22-8-11/ఎ, యడ్లబజార్, పాలకొల్లు.
2. వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, హిందువు, పురుషుడు, 51 సంIIలు, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku-534211

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 303/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Pattisapu Radha and another

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. పట్టిసపు రాధ, W/o. వెంకటాచలం, హిందువు, స్త్రీ, 44 సంIIలు, డో.నెం. 10-4, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, 38 సంIIలు, డో.నెం. 19-5-11, బిసి ట్యాంకు వీధి, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku-534211

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 342/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Arepalli Radha Madhavi and another

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. ఆరేపల్లి రాధా మాధవి, W/o. కృష్ణారావు, హిందువు, స్త్రీ, 42 సంIIలు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, హిందువు, పురుషుడు, 50 సంIIలు, సాయినగర్ కాలనీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku-534211

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 651/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Pajjuri Gopalakrishna and another

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. పజ్జూరి గోపాలకృష్ణ, S/o. లక్ష్మణరావు, హిందువు, పురుషుడు, 48 సంIIలు, కంతేరు, H/o. అడవిపాలెం, పాలకొల్లు మండలం.
2. తొంట జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 43 సంIIలు, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku-534211